# పురాణభూమిలో నారీమహాల్యం

(కథానిక)

ఆనాటికి నాకు పదునాల్గేండ్లుంటాయి. ఇరుగు పొరుగువారి విమర్శలకు జంకి కాబోలు నా చదువు మాన్పించింది మా అమ్మ. "వయస్సు వచ్చినపిల్ల, ఆ మూడు ముండ్లూ పడితేకాని శోభ కనుపించదు" అంటూ ముసలమ్మలు నా ముఖం ముందే అంటూవుండేవారు. స్ఫుటమైన రూప మేర్పడితేనే సుందరిలోని సౌందర్యమని నా శరీర లావణ్యాన్ని ఇద్దరుముగ్గురు వర్ణించుకుంటూంటే విని సిగ్గుపడ్డాను. నేనేదో కొత్త చిగురులు తొడుగుతున్న వనకన్యలాగా అవుతున్నానని అర్థంలేని అనుభూతినిదేన్నో పొందుతూండేదాన్ని.

నా తరువాత నాకు ఆరుగురు చెల్లెండ్రున్నారు. ఇల్లెప్పుడూ గలగలలాడుతూ మారుమ్రోగి పోతూవుండేది. సైజులువారీగా చెల్లెళ్ళంతా కలియ తిరుగుతూ ఉంటే నాకెంతో వినోదంగా ఉండేది. ఆఖరి చెల్లెలు అరవింద ఎప్పుడూ నా చంకనే ఉండాలని మారాము చేసేది. నేను కొంచెం తీరికగా ఒంటరిగా కూర్చుందామంటే అవకాశం దొరికేది కాదు. అమ్మకు సవరించే అన్ని పనులతో బాటు ఆ సోదరీమణులను చక్కదిద్ది సంతృప్తిపరచేసరికీ నాకు హైరానా అయేది. ఆనందమూ కలిగేది.

మా అమ్మ సహజంగానే బలహీనురాలు. ఎప్పుడూ చాకిరీకి తట్టుకోలేక కమిలిపోయే శరీరంతో కుమిలిపోయే అంతర్గత దుఃఖాన్ని దేన్నో వెలివర్చుతోన్నట్టుండేది. ప్రతి కాన్పుకు భయంకర బాధపడుతోంటుందని మా పొరుగు దుర్గమ్మగారు మా అమ్మనుగురించి తరచు సానుభూతి చూపుతూ ఉంటుంది. "అయినా ప్రతిసంవత్సరం ఈ మ్రొక్కుబడి తప్పుదాయె" అంటూ హేళన కూడా చేసేది. మా అమ్మ పరిపూర్ణమైన శీతల రేఖారంజితములైన చిరునవ్వులు నవ్వడం నేనెన్నడూ చూడలేదు. బరువు బండ్ల నీడ్చుకెళ్ళే మొండి బండతనమేదో ఆమె ఉచ్ఛ్వాసనిశ్వాసల్లో ప్రకటితమయ్యేది. ఎప్పుడూ కన్నులు మూసికొనిపోతూ అర్థ నిమీలితంగా నల్లకలవల అందాన్ని స్ఫురింపజేసేవి. అంతవరకు గృహకృత్యములు నెరవేర్చుకొనే కదలికలేని పదగమనిక మా నాన్న కంఠస్వరం దూరంగా రోడ్డుమీద నుండే విని ఎంతో తొట్రుపడిపోయేది. ఆ సంవత్సరానికాసంవత్సరం అమ్మలో ఆఖంగారు, భయం, విరూపంగా విజృంభించుతూ వచ్చాయి కాని, అనేక కాలపరిచయముచేత అనురూపస్థాయిని పొందడము నేను చూడలేదు. ఏదో విరిగి నెత్తిన పడ్డట్టు, ఏదో పెద్దలోపం చేసినట్టు, ఆమె తనలో తానే బెంగగొనడం నాటికీనాటికీ రూపించే జ్ఞాపక చిహ్నమే.

మానాన్న - తాలూకాఫీసులో గుమాస్తా. అరిగి విరిగిన అనేక సంవత్సరముల అనుభవముందని ప్రతీతేకాని జీతం మాత్రం పెరిగిన వార్తలేదు. ఆఫీసులో నాన్న ఎలావుంటారో నాకు తెలియదుకాని ఇంటి వాకిలిలో అడుగు పెట్టేసరికి దెయ్యం సోకిన వానికిమల్లే చిరచిరలాడి పిచ్చిగా మాట్లాడేవాడు. నుదిటిమీది ముడతలు నునుపు తేరిన ప్రశాంత రూపాన్ని ఎప్పుడూ ప్రదర్శింపనిచ్చేవికాదనుకుంటాను. చినిగినకోటు పిగిలిన షర్టు మేము ప్రభుత్వానికి ప్రయోజనకరమైన నౌకరీ కుటుంబమునకు చెందిన వారమని సాక్ష్యమిస్తాయి. ఇల్లెప్పుడూ ఇరకటంగా ఉందని మేము బాధపడకపోయినా ఇంటికి చూడవచ్చిన అమ్మలక్కలు రిమార్కు చేస్తూ ఉండేవారు.

మా భవిష్యత్తు ఒకభవానీదేవి చేతిలోవుందని మానాన్న తరుచూ అంటూండేవాడు. మానాన్న పెద్ద కుంకుమ బొట్టును కొద్దిరోజులనుంచీ విడవకుండా పెడుతూండడం నాకు పిచ్చి అనుమానాలను కల్గించింది...

ఆరోజులు చలియెక్కువగాఉండి తెల్లవారకపూర్వం మంచంవిడిచి బైటకురావాలంటే యమబాధగా ఉండేది. చల్లనినీళ్ళు చేతులకు తగిలి

కొండూరి నరసింహం

కొంకర్లుపోతున్నా నాకు నాల్గంటలవేళే లేవక తప్పేదికాదు. మా అమ్మ ఓపలేక ఏపనీ చేసేది కాదు. నేనే తెల్లవారుజామునలేచి పాచిపని అంతా చేసి, వంటకు అన్నీ సిద్ధపరిచేదాన్ని. మా నాన్న నేచేసిన ఈ సేవలకు తప్పక ఆనందిస్తాడని అనుకునేదాన్ని. "అమ్మా! నీవేనా యీ ముగ్గుపెట్టింది నీవేనా యీ సామాగ్రి సర్దింది" అని పరమానందాన్ని వెల్లడి చేసేపని యేదో చేస్తాడని ఊహాచిత్రాల నెన్నిటినో చిత్రించుకునేదాన్ని. కాని, ఆ గృహపరిసరాలలో నాకు అట్టి సానుభూతి సమకూరలేదు. దానికి బదులుగా "ఏ విద్యలు చూపించుతే మాత్రం ఘల్లుమని కట్నాలు పోయందే పెళ్లికొడుకెవడు తయారవుతాడీ నాంచారమ్మలను వెండ్లి ఆడదాని"కనే పదాలేవో నాచెవుల్లో సూదుల్లా పొడుచుకొనేవి. వాటిలో లోపమేమిటో తెలియక, నాజీవితంలో ఏదో పెద్ద కొరత ఉందని ఏది సత్యమో ఏదసత్యమో తెలియని జిజ్ఞాసలో నామనస్సు కొట్టుకునేది. నాభావాలు ప్రాకులాడేవి. నా అభిమానం ఆరాటపడేది.

నా పితృదేవుని ఆగ్రహాతిశయ వ్యాఖ్యానాలను అర్థంచేసుకోలేని నాస్థితి అరవిందను ఆడించడంలోనో ఉమాదేవిని ఊరుకో పెట్టడంలోనో సర్దుకునేది. నా తరువాతది శకుంతల నాకంటె ఏదో ఎక్కువ అర్థమయినట్టుగానే నటించేది. మూడవచెల్లాయి ఎప్పుడూ మౌనంగా ఉండి శాంతిలోకాల్లో ఎక్కడో కూర్చున్నట్టుండేది.

సాయంకాలము నేను బిందెతో చెరువు మెట్లెక్కుతున్నాను. బరువు బిందె బ్రతుకు బరువుల్ని హృదయంలో ముద్రిస్తోంది. వెనకాల బాతులు రెండు తామరతూళ్ళను తలక్రిందులు చేస్తూ కఠోరధ్వనులను కలిపిస్తున్నాయి. కుర్రాడెవరో నీటిదోసిలిని ఆకసమ్మీదికి చిమ్ముతూ అవ్యక్తానంద మందుతున్నాడు. కాంతమ్మగారు కాలి అందెల ఘలఘలతో రేవులో అడుగుంచింది. అకస్మాత్తుగానే "ఏమో రాజ్యం మీ అమ్మకు పురుడువచ్చే ప్రొద్దులా?" అంది చెలితో వడ్డాణం కదుపుకుంటూ. ఆభరణాలంటే నాకేమీ ప్రత్యేకాభిప్రాయం ఉండేదికాదు కాని ఆవిడ వడ్డాణంచూస్తే అర్థంలేని అసహ్యం తూగి వచ్చేది. కదలని, నశించని పాతబడని పిసుగెత్తిన సంస్కృతియేదో స్ఫురణకు వచ్చేది.

"ఔను" అని మాత్రం అనగలిగాను ఆమెకు సమాధానంగా. "ఎన్నోమాసం?" అంది మరలా. "తొమ్మిది మొన్ననే వెడలె" అంటూ నేను ముందుకు సాగాను. ఆవిడ ఊరుకుంటే కదూ. "పోనీ ఈ పర్యాయమైనా భగవంతు డనుగ్రహిస్తే మీఅమ్మ కోరిక నెరవేరుతుంది. వంశం వర్ధిల్లుతుంది. గోత్రం నిలువబడుతుంది" ఏమేమో వాగుతోంది. నాకెంతో అభిమానం వేసింది. మేమింతమందిమి జన్మించినందుకు విశేషమూ పొగడ్తా లేదుగాని ఇక కలగబోయే బిడ్డకా ఈ సంధింపులు. నేను రుసరుసలాడుతూ నడిచాను.

మా నాన్న ఆఫీసునుంచి తిరిగి వచ్చాడు. మెట్లెక్కుతూ ఉండగా ఆముఖంలోకి చూచేను. అదే నల్లనిఛాయ. ఎరుపు కాంతిని ఫిరాయించగల చీకటి చికాకు, ఏదో విసువు, ఏదో నిరాదృతి.

ఎందుకాబాధ. ఆఫీసురికార్డు సవరించలేకనేనా? మా అమ్మ ఆరుగురి బిడ్డల్ని చక్కబెట్టుకోవడంలేదూ? తను వచ్చేసరికి కాళ్లు కడుక్కునేందుకు నీళ్ళు, తుండుగుడ్డ, మంచితీర్థం, విసనకర్ర...ఎన్ని అమర్చిపెట్టడములేదు? అయినా, ఆ ముఖంలోని మబ్బులు తొలగవే...ఎన్నో రోజులు చూచేను...అంతే.

ఆ చూపులలో మార్పులేదు. ఆ వయస్సులోనే చూపులను అర్థంచేసుకోగలశక్తి నాలో ఉన్నదని గర్వపడేదాన్ని. అయినా మానాన్న చూపులోని తీరని యాక్రోశానికి నాకు అర్థం తెలియలేదు. నేను చెప్పేనే వడ్డాణపుకాంతమ్మగారని ఆవిడవైపు ఆమె భర్త సాంబయ్యగారు చూపులువిసరుతాడు. అందులో, "మనము శ్రీమంతులము, మనకేంలోటు. నగలు నట్రా కావలసినవని చేయిస్తా. ఆ నగలలో కులుకుతూ పావురంలాగ గుబగుబలాడుతూ నడవమని భార్యకు హెచ్చరిక చేస్తున్నాడా" అనిపించేది.

మాయింటిప్రక్కనే శాంతమ్మగారిభర్త ఏదో యేజంటు ఉండేవాడు. ఆయన చూపులకే అందేవాడు కాదుకాని ఆవిడదృష్టిలోమాత్రం కరుడు కట్టిన నిరాశ, కలకలుపడ్డ మనోవైకల్యము, కాగిపోయిన పరితాపం, విస్పష్టమయ్యేవి.

పొరుగు ముసలమ్మగారు దుర్గమ్మగారుండే పెంపుడుకొడుకుని చూసేది. ఆ చూపుకు అర్థం

డేదికాదు. ఏదో కాపేన్నం, ఏదో మమకారం ఆ చూపుల చలపకికాబోలు ప్రతీరాత్రి ఆ అబ్బాయికి వొళ్లు పేలిపోయే జ్వరంవచ్చి పేలాపన కూడా సాగిస్తూ ఉంటాడని అనుకునేవారు.

ఈ రీతి దృష్టిభేదాలేవోకొన్ని నాకు తెలిసినా మా నాన్నచూచే చూపులు వింతగా తీవ్రంగా సంఘర్షణచేస్తోన్నట్లు ఉండి అర్థమయ్యేవికావు.

ఆ నాడు సాయంకాలంనుంచీ మా అమ్మ మైకంలో ఉంది. విపరీతంగా బాధపడుతూండడంగమనించాను. అప్పుడే ఇరుగుపొరుగువారు ఒక చిన్న గుంపును సృష్టించారు. మంత్రసాని హడలుతూ ప్రవేశించింది.


ఎప్పుడు నాన్న ఆఫీసునుంచివచ్చాడో దేవీ మందిరంలో పూజచేస్తున్నాడు. రహస్యంగా చేతికి కట్టుకున్న తాడుతీసి పసుపుకుంకుమలు పట్టించి ఏమో నోట్లో గొణుక్కుంటున్నాడు. ఆ తాయిత్తువల్ల పురుషసంతానం కలుగుతుందని అయిదు రూపాయలు తీసికొని యెవరో యోగి దాన్నిచ్చాడని కాలక్రమములో నాకు తెలిసినది. రాత్రి పదిగంటలు దాటింది. ప్రజ నిశ్శబ్దంలోలోకి పోయి పరున్నారు, మా పొరుగు దుర్గమ్మగారు మంత్రసానీ, తప్ప ఎవరూలేరు. మా అమ్మ మూలుగుమాత్రం వాతావరణంలో ప్రతిధ్వనిస్తోంది. నాన్న దేవీ మందిరంలోనుంచి బైటికి రాకుండా తాయెత్తుమంత్రం కాబోలు తెగ జపిస్తున్నాడు. నేను బుడ్డిదీపపు సన్నకాంతిలో అమ్మ గదిలోకి వెడుతున్నాను. చెల్లెళ్ళంతా తలొకచోట కూలబడి నిద్రపోతున్నారు. మా శంకుతల పెద్ద పెట్టిమీద తల క్రిందికి వ్రేలాడవైచి గుర్రుతీస్తోంది. నా రాక చూచి దుర్గమ్మగారు, “రాజ్యం! వెళ్ళి నిద్రపో. నే నున్నానుగా” అంది.

అబ్బ ఎన్నిరోజులకీ చల్లనిపలుకు వినబడింది. నాబండచాకిరీకినాకిలాటియోదార్పిచ్చింది ఆనాటి ముసలమ్మగారి మాటే. తిన్నగావెళ్ళి నాన్న మంచంమీద వెన్నువాల్చాను. మంత్రసాని భయపడే ముఖమే నా కళ్ళకు కట్టినట్లుంది. ఏదో పిచ్చి ఆలోచనల్లో వుండగా నిద్ర ఆవరించింది. తరువాత ఎన్ని గడియలు గడిచాయో. భూమిలో వుండే జీవులన్నీ ఏడ్చినట్టు వినబడింది. నా చెవులు గింగిరలెత్తాయి. తల అదిరింది. కళ్లు విప్పాను. పొట్టమీద అరవింద యేడుస్తోంది. శకుంతల భోరుమంటోంది. అందరు చెల్లెళ్ళూ ఒక్కసారిగా ఏడ్వడం నాకదే మొదటి అనుభవం. ఏ ప్రళయం వచ్చింది? ఏమి విరుచుకు పడింది? త్రుళ్ళిపడి పైకిలేచి హాలులోకి వెళ్ళాను. ముందుకు చూపులు ఆనలేదు—శబ్దాలే ఎదుర్కొన్నాయి.




రొమ్ము పడిశము
రాత్రి దగ్గు, ఇతర
రొమ్ము ఊపిరితిత్తుల జబ్బులకు
మీకు పెప్స కావలెను.

రుచిగా నుండు ఒక పెప్స బిళ్లను నోటిలో వేసుకొని చప్పరించండి. అది కరిగిన కొద్దీ దాని ఔషధసారములు శ్వాసతో మీ ఊపిరితిత్తుల లోనికి ప్రవేశించి వెంటనే గుణ మిచ్చును. పెప్స దగ్గును అరికట్టును. పుండుపడిన పొరలను మాన్పి శమనపరచును. కఫమును ద్రవపరచును. ఊపిరి ధారాళముగ ఆడునట్లు చేయును.



PEPS
విషనివారకమగు
గొంతు రొమ్ముబిళ్లలు
గొంతు, రొమ్ము, ఊపిరి
తిత్తుల జబ్బులకు
అమోఘ చికిత్స.

FPY 7

"ఇందరూ ఆడపిల్లలే అయితే నన్నేం చెయ్యమని. ఏ సముద్రములో ఊరకమని! మహాపాపమేదో చేస్తేకాని ఈలాటి పాపం సంభవించదు. వాళ్ళందరినీ ఏ గంగలో కూలవెయ్యను? గర్భదరిద్రునికి అల్లుడిగావచ్చే దెవడు? ఒక్కసారిగా భగవంతుడు నన్ను తీసికొనైనా వెళ్ళడు." నాన్న భాష అంతకంతకు తీవ్రమౌతోంది. అమ్మ మూలుగు ఎక్కడ విలీనం అయిందో... శబ్దం లేదు. కన్నులు తుడుచుకొని చూచాను. చిందరవందరగా పడివున్న వస్తువులు. మా నాన్నే వీటి నన్నిటిని విసరికొడుతున్నాడని త్రుటిలో గ్రహించాను. అంతేకాదు. నాన్న నేలకు తల బాదుకొంటున్నాడు. అప్పుడప్పుడు "ఆడపిల్లల తండ్రిని బ్రతికిలాభంలేదని" పలికే నాన్న మాటలు "అబ్బబ్బ, మీరందరునాన్న ప్రాణాలుతీయడానికే పుట్టారు. బీదవాళ్ళకు ఇలా శిక్షవేసే దేముడి అభిప్రాయ మేమిటో" అని నిట్టూర్చే నిట్టూర్పులు నాతలలో పునఃవ్యాఖ్యా నింపబడ్డాయి. ఏం చెయ్యాలి? తొందరగా నాన్నదగ్గరకు పరుగెత్తాను. తల పగిలిపోతుందేమో అని భయంతో నాన్నా అని అరిచాను. "ఛీ ఛీ, మాల. ఘోరంగా నీ వేముహూర్తాన పుట్టావో నాకొంపకి దరిద్రమే పట్టింది. ఛండాలపు మొఖం ఉరికి చావరాదూ" అంటూ తీవ్రంగా అంటూనే తల బాదుకుంటున్నాడు నాన్న. అయితే నా పుట్టుకలో ఇంత దరిద్రకారణముందని నాకా గడియలోనే తెలిసింది, అమ్మవైపు పరుగెత్తుదామనే వాంఛనుకూడా ఆ చీవాట్లే నిలవేసేశాయి.

ఎన్నిమాసాలో భారంతో క్రుంగిపోయే శరీరాన్ని, ఆ యిరుకుకొంప కంకితంచేసి కండరాలు కరగించుకొనే శక్తి, రక్తమంతా నీరు చేసికొనే శక్తి అమ్మకే భగవానుడు ప్రసాదించాడో విషమసమస్య అయిపోయింది.

మంత్రసాని దొడ్డిదోవన పారిపోయిందని, ఉపచారదక్షతలేకపోతే బాలెంతరాలుకు ప్రాణాపాయమని హెచ్చరిస్తూ మాయింటిలోని రోదన ధ్వనులను వినలేక కాబోయి దుర్గమ్మగారు త్రోవ తీసింది. నేను కంగారుగా పురిటిగదివైపు పరుగెత్తాను. మానాన్న విసరివేచిన కత్తిపీట త్రోవలోనే ఉందిగావును. తగిలి బోర్లపడ్డాను. ఎక్కడ చీరుకుందో. రక్తం జాలిలేకుండా ప్రవహించింది.

* * *

ఇప్పుడు నేను ఒక ఉపాధ్యాయునికి అర్ధాంగినిలెండి. సుఖంగానే ఉన్నా... మా తమ్ముడు "రామూ" వీధిబడిలో మూడవతరగతి చదువుతున్నాడు. మా నాన్న కుంకంబొట్టుకొంచెం సన్నగిలిందికాని తమ్ముడిపొట్ట లావుబారుతోంది... జబ్బుశరీరం, దగ్గు, ఆయాసము, సరిగానడవలేడు. తిన్నది కక్కుకుంటాడు. అయినా మా నాన్న కేనుగునెక్కినంత ఆనందం, మా అమ్మకు బాకీతీరినంత సంతోషం. నాకుమాత్రమే అన్నీ విషమ సమస్యలు.

ఏది జ్ఞానమో, ఏది అజ్ఞానమో తెలియని మానవులము మరి.

సెక్చ్

# నిచ్చెనకి అందని స్వర్గం

పావనరాం

మూర్తీ, నేనూ ప్రాణస్నేహితులం. ఎప్పుడూ మేమిద్దరమూ కలిసి తిరుగుతూండడం వల్ల—"తనువులు వేరైనా, మనస్సులొకటే"—అన్న తంతువాళ్ళలో మమ్మల్నిదర్శి జమకట్టేశారు—మా మిత్రబృందం.

స్వతహాగా మూర్తి మాటకారి. క్రొత్తవాళ్లతో ఇట్టే పరిచయం కలుగజేసుకోగలడు. కనుకనే అతని "స్నేహితుల బృందం" పెద్దది. నేను మూర్తికి స్నేహితుణ్ణి కావడంచే, అతని మిత్రులందరితో నాకుకూడా కొద్దో, గొప్పో పరిచయభాగ్యం కలిగేది.

ఓనాడు, రీడింగ్ రూమ్‌దగ్గర మాకో వ్యక్తి కనబడ్డాడు. అతణ్ణి మూర్తి నాకు "ఇంట్రడ్యూస్" చేశాడు—"ఇతనూ, నేనూ గుంటూరులో కలిసి చదువుకొన్నాం, పేరు చంచలరావు ఇక్కడ యూనివర్సిటీలో "కెమిస్ట్రీ"లో డి.